స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

బౌద్ధనగర్: బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవిప్రసాద్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో మహాత్మ జ్యోతిరావు పూలే వెనకబడిన తరగతుల కమిషనర్ బాల మాయదేవిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డుకు సంబంధించిన పెండింగ్ బిల్లులు సత్వరమే విడుదల చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. మంగళవారం మంత్రిని కలిసి ప్రత్యేకంగా విన్నవించారు. ఐదు నెలలుగా పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడంతో చెత్త తరలింపు కాంట్రాక్టర్ పనులు నిలిపివేసినట్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మార్కెట్ యార్డు ఆవరణ అంతా చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతుందని తెలిపారు. సెక్యూరిటీ కాంట్రాక్టర్‌కు సైతం ఐదు నెలలుగా బిల్లులు ఇవ్వలేదన్నారు. స్పందించిన మంత్రి తక్షణమే పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

బాలుడు అదృశ్యం

సనత్‌నగర్: బాలుడు అదృశ్యమైన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట రసూల్‌పురా ప్రాంతానికి చెందిన బాలుడు (17) గత నెల 21న రామ్‌నగర్‌లో ఉంటున్న సోదరి ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లాడు. అయితే బాలుడు సోదరి ఇంటికి చేరుకోలేదు. అతని కోసం కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో బాలుడు తనకన్నా పెద్దదైన ఓ యువతితో వెళ్లిపోయినట్లు గుర్తించారు. దీంతో కిడ్నాప్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. గతంలో కూడా బాలుడు ఒకసారి వెళ్లి 10 రోజుల తర్వాత తిరిగి వచ్చాడని పోలీసుల విచారణలో తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా బండ కార్తీకచంద్రారెడ్డి



లాలాపేట: తెలంగాణ బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా ఇటీవల నియమితులైన మాజీ మేయర్ బండ కార్తీకచంద్రారెడ్డిని మంగళవారం పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు తార్నాకలోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలనీ నేతలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండ చంద్రారెడ్డి, మహిళా నాయకురాళ్లు అనిత, అనూష, సరోజ, శ్రీవాణి, సత్యవతి, తార్నాక డివిజన్ అధ్యక్షులు ఉపేందర్ యాదవ్, జిల్లా కార్యదర్శి వీరన్న, సీనియర్ నాయకులు వేణు యాదవ్, పోచయ్య యాదవ్, సంపత్, కృష్ణమూర్తి, హంసరాజ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

అధ్వానంగా రహదారులు

అడ్డగుట్టలో దెబ్బతిన్న రోడ్లు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు
- పట్టించుకోని అధికారులు



అడ్డగుట్ట సీ సెక్షన్, తుకారాంగేట్ ఆర్‌యూబీ వద్ద దెబ్బతిన్న రోడ్లు



గుంతలమయంగా మారిన రోడ్లతో నిలిచిన మురుగు

అడ్డగుట్ట: ఇటీవల కురిసిన వర్షాల దాటికి అడ్డగుట్టలో రోడ్లు అధ్వానంగా మారాయి. వాటికి మరమ్మతులు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నామంటూ వాపోతున్నారు. అడ్డగుట్ట, తుకారాంగేట్ ప్రధాన రోడ్డు మార్గాలతో పాటు బీ, సీ సెక్షన్లలో రోడ్లన్నీ గుంతలమయంగా దర్శనమిస్తున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు సందర్భాల్లో వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ సంబంధిత జీహెచ్ఎంసీ సిబ్బంది దెబ్బతిన్న రోడ్లకు తగిన మరమ్మతులు చేయడం లేదు.

మరిచిన ప్యాచ్ వర్క్ పనులు

ప్రధాన రోడ్డు మార్గం రోడ్లన్నీ దెబ్బతిన్నప్పటికీ వాటికి ప్యాచ్ వర్క్‌పనులు చేయడంతో అధికారులు చూపుతున్న అలసత్వానికి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతల మయంగా మారిన రోడ్లలో వర్షపు నీరు, మురుగునీరు చేరి దుర్గంధం వెదజల్లుతుందని ,అంతే కాకుండా అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లపై నుంచి వాహనాలు వెళ్తున్న సమయాల్లో ఆ నీళ్లు దుకాణాల్లో పడుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

పేరుకుపోతున్నా పట్టించుకోరా?

తుకారాంగేట్‌లోని కొండారెడ్డి పార్కు పక్కనే దాదాపు పది రోజుల క్రితం చెట్ల కొమ్మలను వేసిన సిబ్బంది వాటిని ఇప్పటికీ తొలగించలేరు. దీంతో కురుస్తున్న వర్షాలకు పేరుకుపోయిన చెట్ల కొమ్మల నుంచి దుర్వాసన వస్తుందని స్థానికులు పేర్కొన్నారు. పార్కు గేటు పక్కనే వీటిని వేయడంతో దుర్భరమైన దుర్గంధంతో ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందని పార్కుకు వచ్చేవాళ్లు వాపోతున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



కొన్ని నెలలుగా సీ సెక్షన్‌లో రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. ఈ దారిలో పోవాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఇక రాత్రి సమయాల్లో ఈ దారిగుండా అసలు నడవలేకపోతున్నాం. సంబంధిత అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. బస్తీల్లో దెబ్బతిన్న రోడ్లను బాగు చేయాలి.
– లక్ష్మమ్మ, సీ సెక్షన్, అడ్డగుట్ట

బకాయిలు వెంటనే విడుదల చేయాలి



ముఖ్యమంత్రి దిష్టిబొమ్మతో ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

రాంగోపాల్‌పేట్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ చెర్క బాలకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్ క్లాక్‌టవర్ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు అక్కడే బైఠాయించి ఆందోళన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ రూ.8500కోట్లను విడుదల చేస్తామని ప్రకటించి, గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటి వరకు వాటిని విడదుల చేయలేదని విమర్శించారు. ఉన్నత విద్య కోసం విద్యార్థులు కళాశాలల్లో సర్టిఫికేట్ల కోసం వెళితే ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికేట్లు ఇస్తామని యాజమాన్యాలు చెబుతున్నాయని దీంతో ఉన్నత విద్యకు వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం పోలీసులు ధర్నా చేస్తున్న విద్యార్థులను అక్కడి నుంచి పంపించి వేశారు.

గాంధీలో కేన్సర్ చికిత్స కేంద్రం ప్రారంభం



కేన్సర్ చికిత్స కేంద్రాన్ని వర్చువల్‌గా ప్రారంభిస్తున్న దృశ్యాన్ని తిలకిస్తున్న గాంధీ పాలనయంత్రాంగం

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో కేన్సర్ చికిత్స కేంద్రం (పల్లియేటివ్‌కేర్ సెంటర్) అందుబాటులోకి వచ్చింది. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా పల్లియేటివ్ కేర్ సెంటర్‌ను సోమవారం వర్చువల్‌గా ప్రారంభించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్ఎస్ రాజకుమారి, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 33 టీచింగ్ ఆస్పత్రుల్లో పల్లియేటివ్ కేర్ సెంటర్లను మంత్రి ప్రారంభించారని వివరించారు. డేకేర్, పల్లియేటివ్ సెంటర్లలో పది పడకలు, కీమోథెరపీ, నొప్పి నివారణ తదితర వైద్యసేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ సెంటర్లను ఎంఎంజే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ పర్యవేక్షిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవిశేఖరరావు, ఆర్ఎంఓ-1 శేషాద్రి, అనస్తీషియా, జనరల్ మెడిసిన్ హెచ్ఓడీలు మురళీధర్, రాజారామ్, సంబంధిత అధికారులు, ఆర్ఎంఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రపతి నిలయంలో తెలుగు భాషా వారోత్సవాలు



గిడుగు వెంకటరామమూర్తి , కాళోజీ నారాయణ రావులకు నివాళులర్పిస్తున్న అతిథులు

బొల్లారం: రాష్ట్రపతి నిలయంలో తెలుగు భాషా వారోత్సవాలు-2025 ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు, విద్యార్థులు, కళాకారులు, సాంస్కృతిక ప్రముఖులు హాజరయ్యారు. గిడుగు వెంకట రామమూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రారంభమైన ఈ వారోత్సవాలు, సెప్టెంబర్ 9న ప్రజాకవి శ్రీ కాళోజీ నారాయణరావు జయంతి వరకు నిర్వహించారు. అష్టావధాని, రచయిత అవుసుల భానుప్రకాష్ ముగింపు వేడుకలకు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ చుక్కి సీతారామయ్య, కవి వేములపల్లి కోటేశ్వరరావు, సంగీత దర్శకుడు, గాయకుడు వందేమాతరం శ్రీనివాస్, ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం ప్రోగ్రాం హెడ్ రమేశ్ సుంకసారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కల్చర్ బృందం సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రముఖుల గౌరవార్థం తెలుగు అకాడమీ డైరెక్టర్, స్వాతంత్ర్య సమరయోధుడు డా. వెల్చాల కొండల్ రావు, శ్రీ చరణ్ అర్జున్ తదితరులను సత్కరించారు. అనంతరం వాదవివాదం, గోడ ప్రదర్శన, వక్తృత్వం, వ్యాసరచన, ప్రశ్నోత్తర పోటీ, జానపద కథల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సత్కరించి షీల్డ్‌లను అందజేశారు. సుమారు 20 పాఠశాలలు, కళాశాలల నుండి 700 మందికి పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

సనత్‌నగర్: తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి పాల్పడిన సంఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట రసూల్‌పురాలో నివసించే పోచయ్య తన కుటుంబ సభ్యులతో కలిసి 7వ తేదీ రాత్రి ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాడు. తిరిగి మరుసటి రోజున ఇంటికి చేరుకొని చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడం కనిపించింది. లోనికి వెళ్లి చూడగా అల్మారాలో దాచిన 2 తులాల బంగారు ఆభరణాలు, 5 తులాల వెండి వస్తువులు, రూ.6 వేల నగదు కనిపించలేదు. దీంతో బాధితులు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రిపుల్ ఆర్‌కు వ్యతిరేకంగా ఆందోళన

ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు



హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద చేస్తున్న రైతులు

అమీర్‌పేట: ట్రిపుల్ ఆర్‌ను వ్యతిరేకిస్తూ రైతులు రెండో రోజు మంగళవారం అమీర్‌పేటలోని హెచ్ఎండీఏ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. రంగారెడ్డి జిల్లా జిల్లెడ్ చౌదరిగూడ మండలంలోని తూంపల్లి, వనంపల్లి గ్రామాలకు చెందిన రైతన్నలు పెద్ద ఎత్తున చేరుకొని ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలైన్మెంట్లు మార్చడం వల్ల ప్రజలు భూములు కోల్పోయే ప్రమాదముందని తెలిపారు. భూములపై ఆధారపడి జీవిస్తున్న వందలాది మంది చిన్న చిన్న రైతులు రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. అలైన్మెంట్‌లను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ భూములపై చాలా మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. రైతుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ముందుకెళ్లాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

బీకేగూడలో ప్రభుత్వ స్థల ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న అధికారులు



అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ బీకేగూడ ఈడబ్ల్యూఎస్ కాలనీలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నించారు. రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన సైన్‌బోర్డులను రాత్రికి రాత్రి తొలగించి షెడ్ల నిర్మాణ పనులు చేపట్టారు. మంగళవారం మధ్యాహ్నం స్థానికులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సర్వేర్ బాల్‌రాజ్,ఆర్ఐ కిరణ్‌లు ఆక్రమణలను అడ్డుకున్నారు. అప్పటికే టిన్ షెడ్ల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన ఇనుప రాడ్లను తొలగించారు. సదరు స్థలం ప్రభుత్వానిదని సూచిస్తూ తిరిగి సైన్ బోర్డులు ఏర్పాటు చేయించారు. దీనిపై అమీర్‌పేట తహసీల్దార్ పద్మసుందరి మాట్లాడుతూ స్థల వివాదం కోర్టులో ఉందని తెలిపారు.

పన్ను భారం తగ్గించాలి


పేపర్స్ మర్చంట్స్ అసోసియేషన్ డిమాండ్



మాట్లాడుతున్న అభిషేక్ విజయవార్జీ తదితరులు

సనత్‌నగర్: కాగితం విలాస వస్తువు కాదని, ఇది అత్యవసర వస్తువు అని, దీనిపై పన్ను భారం తగ్గించాలని తెలంగాణ పేపర్స్ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అభిషేక్ విజయవార్జీ విజ్ఞప్తి చేశారు. బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, వృత్తిదారులు, ప్రచురణకర్తలు, ప్రింటర్లు, ప్యాకేజింగ్ పరిశ్రమ, ఇంకా సమాజంలో ఎంతోమంది ప్రతిరోజూ ఉపయోగించే ఒక అత్యవసర వస్తువు కాగితం అన్నారు. ఇటీవల జీఎస్టీని 18 శాతానికి పెంచడం వల్ల విద్య, సంబంధిత పరిశ్రమలపై అధిక భారం పడుతుందన్నారు. కాగితం, బోర్డులపై జీఎస్టీ 18 నుంచి 5 శాతానికి తగ్గించడం ద్వారా విద్యార్థుల విద్యా ఖర్చులు తగ్గుతాయన్నారు. రీసైక్లింగ్, పర్యావరణహిత కాగితం సంచులు ప్రోత్సహించబడతాయని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ పేపర్ మర్చంట్స్ అసోసియేషన్ కార్యదర్శి ఆశిష్‌జైన్ బన్సాలీ, మాజీ అధ్యక్షులు టి.కృష్ణసింగ్, ఫెడరేషన్ ఆఫ్ పేపర్ ట్రేడర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు నిర్మల్‌కుహద్ తదితరులు పాల్గొన్నారు.





ఉపాధ్యాయుల సేవలు మహోన్నతమైనవి




సెయింట్ ఫ్రాన్సిస్ మహిళా కళాశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రిన్సిపాల్



ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న విద్యాశాఖ అధికారులు శ్రవణ్‌కుమార్, స్వర్ణలత

ఉపాధ్యాయుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆయా డివిజన్లలోని పాఠశాలల్లో నాయకుల సమక్షంలో ఉపాధ్యాయుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. గురువులను గౌరవించుకోవాలని, విద్యార్థుల భవిష్యత్‌ను అందంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు

రోగి సహాయకురాలు అదృశ్యం



కిష్టమ్మ

గాంధీఆస్పత్రి: రోగి సహాయకురాలు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరు అల్లాపూర్‌కు చెందిన గడగల నాగప్ప అస్వస్థకు గురై ఈనెల 3న గాంధీ ఆస్పత్రిలో అడ్మిట్ అయ్యాడు. భార్య కిష్టమ్మ (42)రోగి సహాయకురాలిగా సేవలు చేస్తోంది. ఈనెల 8న బయటకు వెళ్లిన కిష్టమ్మ తిరిగి వార్డుకు రాలేదు. పలు ప్రాంతాల్లో గాలించిన ఫలితం లేకపోవడంతో కుమారుడు రాజు పోలీసులను ఆశ్రయించాడు. ఆమెకు కల్లు తాగే అలవాటు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.


హైడ్రా పరిశీలనలో తార్నాక ఎర్రకుంట చెరువు

లాలాపేట: చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల మార్కింగ్ అయ్యేంత వరకు తార్నాక ఎర్రకుంట చెరువు భూముల్లో ఏలాంటి కార్యకలాపాలు, భారీ వాహనాల రాకపోకలు చేయరాదని మారెడ్‌పల్లి తహసీల్దార్ రాజు నాయక్ అన్నారు. మంగళవారం సాక్షి దినపత్రికలో ఎర్రకుంట చెరువును కబ్జాదారుల నుంచి కాపాడాలంటూ 'హైడ్రా అధికారులూ చెరువును అభివృద్ధి చెయరూ' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. సర్వేయర్ శ్రీనివాస్‌తో కలిసి తార్నాక ఎర్రకుంట చెరువును ఎమ్మార్వో పరిశీలించారు. ఈ సందర్భంగా తాహసీల్దార్ మాట్లాడుతూ చెరువు విషయమై హైడ్రా అధికారుల పరిశీలనలో ఉందన్నారు. చెరువు భూముల్లో నిర్మాణ వ్యర్థాలు వేయకూడదన్నారు.

నేడు గాంధీలో వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్‌డే ర్యాలీ

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి, మెడికల్ కాలేజీ సంయుక్త ఆధ్వర్యంలో వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఉదయం 11 గంటలకు గాంధీ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమాలు, చైతన్యర్యాలీ నిర్వహించనున్నట్లు గాంధీ సైకియాట్రిక్ విభాగాధిపతి డాక్టర్ అనుపమ తెలిపారు.

ఫిజియోథెరపిస్టుల పాత్ర కీలకం



రాంగోపాల్‌పేట్: వైద్యులు శస్త్ర చికిత్సలు పూర్తి చేశాక ఫిజియోథెరపిస్టులు అందించే చికిత్సతోనే రోగి పూర్తిగా ఆరోగ్యవంతంగా కోలుకుంటారని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ 320ఈ క్యాబినెట్ సెక్రటరీ తాళ్ల అంజయ్య అన్నారు. సోమవారం రాత్రి సికింద్రాబాద్ లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ అపూర్వ ఆధ్వర్యంలో ఫిజియోథెరఫీ దినోత్సవం సందర్భంగా జంటనగరాల్లోని ఫిజియోథెరపిస్టులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జాయింట్ కలెక్టర్ నైనాదేవి, అపూర్వ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ సూర్యనారాయణ, సీనియర్ ఫిజియోథెరపిస్టు శ్రీదేవి , లయన్స్ క్లబ్ డైరీ చీఫ్ ఎడిటర్ పవన్‌కుమార్, మాజీ రీజనల్ చైర్‌పర్సన్ శంకర్, ఫిజియోథెరపిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రచయిత లతా పేష్కర్‌కు ట్రస్మా సత్కారం

సనత్‌నగర్: పాఠశాలల మేనేజింగ్ అసోసియేషన్ (ట్రస్మా) సికింద్రాబాద్ మండల ఆధ్వర్యంలో మంగళవారం బేగంపేట విమాన్‌నగర్ నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో ప్రముఖ రచయిత లతా పేష్కర్‌ను సత్కరించారు. ట్రస్మా హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. హిబిస్కస్ హట్, ది మిస్టీరియస్ టేల్స్ ఆఫ్ మహారాజపురం, హరినారాయణ స్ట్రీట్ పుస్తకాలు ప్రభావితం చేశాయన్నారు. ట్రస్మా సభ్యులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జేమ్స్ స్ట్రీట్ రైల్వే స్టేషన్ సమీపంలోని ట్రాక్ వద్ద రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కే.పండరి తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు వివరించారు. పోలీసులకు మృతుడి వివరాలు లభించలేదు. మృతుడి ఒంటిపై తెల్లని నిండు చొక్కా, బూడిదరంగు ప్యాంట్, ఎడమచేతిపై గణేశ్-నాగమ్మ అని పచ్చబొట్టు ఉన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మరిన్ని వివరాల కోసం 8712658581 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.



విజేతగా నిలిచిన సంఘమిత్ర జట్టు

ప్రజాకవికి ఘన నివాళి



కాళోజీ నారాయణరావుకు నివాళులర్పిస్తున్న మారేడ్‌పల్లి తహసీల్దార్ రాజు నాయక్, సిబ్బంది

అడ్డగుట్ట: నిజాం నిరంకుశ పాలనపై కలం ఎక్కుపెట్టిన ప్రజాకవి కళోజీ నారాయణరావు అని మారేడ్‌పల్లి తహసీల్దార్(ఎఫ్ఏసీ) రాజునాయక్ అన్నారు. ప్రజాకవి కాళోజీ నారాయణ రావు జయంతిని మంగళవారం మారేడ్‌పల్లి మండల కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి తహసీల్దార్ రాజునాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మోహన్, ఆర్ఐలు సర్వేష్‌సింగ్, కృతిక సింగ్, సృజన తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్: తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) కార్యాలయంలో మంగళవారం ప్రజాకవి పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకొని తెలంగాణ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా టీజీపీసీబీ ఉన్నతాధికారులు, సిబ్బంది హాజరై కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ కృపానంద్, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ వినయ్‌కుమార్‌నాయుడు, ప్రాజెక్ట్ ఆఫీసర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వాలీబాల్ పోటీలు



విజయం సాధించిన విజ్ఞాన్‌జ్యోతి జట్టు

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లోని రెండు రోజుల పాటు నిర్వహించిన స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కంజర్ల శంకర్‌యాదవ్ స్మారక అంతర పాఠశాలల వాలీబాల్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీల్లో సంఘమిత్ర, విజ్ఞాన్‌జ్యోతి పాఠశాలల జట్లు విజేతలుగా నిలిచాయి. నగరంలోని 19 పాఠశాలల నుంచి దాదాపు 400 మంది విద్యార్థులు వాలీబాల్ తలపడ్డారు. మంగళవారం జరిగిన ఫైనల్ పోటీల్లో గెలిచిన విజేత జట్లకు, క్రీడాకారులకు స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ బి.శ్యాంసుందర్‌గౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్ రాధిక, ట్రస్ట్ ప్రతినిధులు చంద్రశేఖర్‌గుప్తా, కంజర్ల చంద్రకళాయాదవ్, డాక్టర్ హెచ్ఎస్ త్రిపాఠి, సూర్యనారాయణ తదితరులు ట్రోఫీలు, బహుమతులను అందజేశారు.